క్లుప్తంగా

ఆస్పత్రిలో సౌకర్యాలు పరిశీలన



ఆస్పత్రి సిబ్బందితో తనిఖీ బృందం

ఖానాపూర్: పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిని బుధవారం అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా బృందం సభ్యులు తనిఖీ చేశారు. ఈసందర్భంగా పరిసరాలు, వైద్యసేవలు, సౌకర్యాలను అధ్యయనం చేశారు. వార్షిక తనిఖీలో భాగంగా ఆస్పత్రి పరిశీలించి సమకూర్చాల్సిన వసతుల విషయమై ప్రభుత్వానికి నివేదించనున్నట్లు బృందం డీన్ డాక్టర్ సుబోధ్ అన్నారు. కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ వంశీమాధవ్, వైద్యులు, సిబ్బంది ఉన్నారు.

పాఠశాలలో పాము కలకలం



చనిపోయిన పాము

నర్సాపూర్(జి): మండలకేంద్రంలోని ఉర్దూ ప్రాథమిక, ఉన్నత పాఠశాలలో పాము కలకలం రేపింది. బుధవారం పాఠశాల ఆవరణలోకి పాము రావడంతో విద్యార్థులు భయాందోళనకు గురయ్యారు. సిబ్బంది గమనించి పామును చంపడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. భవనం వెనుక పిచ్చిమొక్కలు ఏపుగా పెరగడంతో విషసర్పాలకు అడ్డాగా మారింది. పాఠశాలలో పిచ్చి మొక్కలు తొలగించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

పాత నేరస్తుల బైండోవర్

తానూరు: మండలంలోని జౌలా(కే), దాగాం గ్రామాలకు చెందిన ఇద్దరు పాత నేరస్తులను బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ మహేందర్‌నాథ్ ఎదుట బైండోవర్ చేసినట్లు ఎస్సై షేక్ జుబేర్ ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని ఇద్దరిని బైండోవర్ చేసినట్లు పేర్కొన్నారు.

ముధోల్ ఎమ్మెల్యే పూజలు



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే రామారావు

ముధోల్: మండలంలోని ఎడ్‌బిడ్ గ్రామంలో బుధవారం సత్యమ్మ ఆలయ విగ్రహ ప్రతిష్ఠాపన ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే రామారావుపటేల్ హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ డైరెక్టర్ ధర్మపురి సుదర్శన్, మాజీ జెడ్పీటీసీ లక్ష్మీ నర్సాగౌడ్, నాయకులు దేవోజీ భూమేష్, అనిల్, దత్తు, రమేశ్, జీవన్ ప్రశాంత్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

వారసంత ప్రారంభం



సంతను ప్రారంభిస్తున్న వీడీసీ సభ్యులు

లక్ష్మణచాంద: మండలంలోని వడ్యాల్ గ్రామంలో బుధవారం వారసంతను వీడీసీ సభ్యులు ప్రారంభించారు. ప్రజల నిత్యావసరాలను తీర్చేందుకు వారసంత ఉపయోగపడుతుందని.. సమీప గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వీడీసీ సభ్యులు కోరారు.

ప్రిన్సిపాల్‌కు అవార్డు



అవార్డు అందుకుంటున్న అనితసాబు

ఖానాపూర్: పట్టణంలోని కేరళ మోడల్ ఇంగ్లిష్ మీడియం పాఠశాల ప్రిన్సిపాల్ అనితసాబు ఉత్తమ ఉపాధ్యాయురాలిగా అవార్డు అందుకున్నారు. అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం పురస్కరించుకుని కేరళ ప్రభుత్వం సాంస్కృతిక వ్యవహారాలశాఖ అంతర్జాతీయ అధ్యయన తీర్థయాత్ర కేంద్రం ఆధ్వర్యంలో తిరువనంతపురంలో ఈ అవార్డు అందజేశారు. కేరళకు చెందిన గ్రామస్వరాజ్ ఫౌండేషన్ ఎంపిక మేరకు ఈ అవార్డు అందించినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు.

బతుకమ్మ వేడుకలు

లక్ష్మణచాంద: మండలకేంద్రంలో గ్రామస్తుల ఆధ్వర్యంలో నడుస్తున్న సహకార జూనియర్ కళాశాలలో బుధవారం బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. తీరొక్క పూలతో బతుకమ్మలను పేర్చి విద్యార్థులు ఆడిపాడారు.

ట్రాక్టర్ల పట్టివేత

లక్ష్మణచాంద: అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకున్నట్లు ఎస్సై శ్రీనివాస్ పేర్కొన్నారు. బుధవారం మండలంలోని కనకాపూర్ గ్రామ సమీపంలో అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అక్రమంగా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై హెచ్చరించారు.

అమ్ముకునే దాకా కష్టాలే



విత్తనం విత్తినప్పటి నుంచి చేతికొచ్చిన పంటను అమ్ముకునే దాకా రైతన్నకు కష్టాలు తప్పడం లేదు. కుంటాలకు చెందిన చాకలి రాజన్న ఐదెకరాల్లో మొక్కజొన్న పంట సాగు చేశాడు. ఇటీవల పంటను నూర్పిడి చేసి గ్రామ శివారులోని కల్లంలో ఆరబెట్టాడు. ప్రభుత్వం కొనుగోళ్లు ప్రారంభించకపోవడంతో పశువుల నుంచి రక్షించుకునేందుకు రూ.12వేలతో పంట చుట్టూ సోలార్ కంచె ఏర్పాటు చేసుకున్నట్లు రైతు చెప్పుకొచ్చాడు. – కుంటాల

నేత్రపర్వంగా రథోత్సవం

ఖానాపూర్ మండలంలోని సుర్జాపూర్‌లో శ్రీ లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం రథోత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా ఉత్సవమూర్తులను రథంపై ఉంచి భక్తులు వీధుల గుండా ఊరేగించారు. గోవిందుడి నామస్మరణతో కాలనీలు మారుమోగగా.. మహిళలు మంగళహారతులతో స్వామివారికి స్వాగతం పలికారు.





పశువులతో ప్రమాదం

కడెం: మండలకేంద్రంలోని రోడ్లపై నిత్యం తిరిగే పశువులను ఢీకొని వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి పశువులను గోశాలకు తరలించి ప్రజలను ప్రమాదాల నుంచి కాపాడాలని స్థానికులు కోరుతున్నారు.

మడిగెలు తెరువరూ..

- సారంగపూర్ మార్కెట్ యార్డులో ఖాళీగా షెట్టర్లు
- బిల్లులు ఇవ్వకపోవడంతో కొత్త భవనం అప్పగించని కాంట్రాక్టర్
- ఆదాయం కోల్పోతున్న వైనం



నిరుపయోగంగా పాతమడిగెలు



ప్రారంభానికి నోచుకోని కొత్త మడిగెలు

సారంగపూర్: మండలకేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డు కమిటీ ఆదాయం ఏటేటా తగ్గుతూ వస్తోంది. గతంలో నిర్మించిన కమర్షియల్ కాంప్లెక్స్ భవనంలో ఆరు మడిగెలు(షెటర్లు) ఉండగా ఒక్కటి మాత్రమే అద్దెకు ఇచ్చారు. మిగతా ఐదు నిరుపయోగంగా మారాయి. 2024లో రూ.70లక్షల వ్యయంతో మరో పది మడిగెలను నిర్మించారు. ఈ కాంట్రాక్టర్‌కు బిల్లులు చెల్లించకపోవడంతో నూతన మడిగెలను ఇప్పటికీ మార్కెట్ అధికారులకు అప్పగించలేదు.

ఖాళీగా పాత భవనంలో ఐదు మడిగెలు..

నిబంధనల మేరకు పాత మడిగెలకు 2023లో టెండర్లు నిర్వహించగా నాలుగు మడిగెలను టెండర్లలో పాల్గొన్న వ్యాపారులు దక్కించుకున్నారు. ముగ్గురు డిపాజిట్లు చెల్లించినా సదరు మడిగెల్లో వ్యాపారాలు ప్రారంభించలేదు. అధికారులు మూడు నెలలు వేచిచూసి వ్యాపారుల డిపాజిట్లను జప్తు చేశారు. ప్రస్తుతం ఆరు మడిగెల్లో ఒకటి మా త్రమే నడుస్తుండగా మిగతా ఐదు ఖాళీగానే దర్శనమిస్తున్నాయి. నడుస్తున్న ఒక మడిగెకు ఏడాదికో సారి ఐదుశాతం అద్దె పెంచుతూ కొనసాగిస్తున్నా రు.

కొత్తవాటి ఊసేలేదు..

రూ.70లక్షలతో 10 మడిగెలు నిర్మించిన కాంట్రాక్టర్‌కు బిల్లులు చెల్లించకపోవడంతో వాటిని ఏఎంసీకి అప్పగించలేదు. దీంతో వాటికి టెండర్లు నిర్వహించడం లేదని అధికారులు పేర్కొంటున్నారు.

నిబంధనలివీ..

మడిగె కోసం టెండర్లలో పాల్గొనే వ్యాపారుల నుంచి రూ.50వేలను డిపాజిట్‌గా తీసుకుంటారు. డిపాజిట్ చెల్లించిన వ్యక్తి మాత్రమే టెండరు వేసేందుకు అర్హుడు. ఈలెక్కన ప్రతి ఏడాది ఏఎంసీ(వ్యవసాయ మార్కెట్‌యార్డు కమిటీ) నిబంధనల ప్రకారం టెండర్లు నిర్వహించి అద్దె ఎక్కువ ఎవరు కోడ్ చేస్తారో వారికి ఏడాది ఒప్పందం మేరకు అద్దెకు ఇస్తారు.

మార్కెట్ ఆదాయానికి గండి..

పాత మడిగెలు 5.. కొత్త మడిగెలు 10 మొత్తం 16 మడిగెలు నిరుపయోగంగా మారాయి. ఈ మడిగెలు ప్రారంభమైతే నెలకు ఒక మడిగెకు రూ.5వేల చొప్పున మొత్తం రూ.80వేల ఆదాయాన్ని మార్కెట్ కమిటీ కోల్పోతుంది. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి మడిగెల విషయంలో చొరవ చూపాలని కోరుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం గతేడాది అక్టోబర్ 16న సారంగపూర్ ఏఎంసీ పాలకవర్గాన్ని నియమించింది. ఈ పాలకవర్గం నియమించి ఏడాది దాటినా మడిగెలను అద్దెకు ఇచ్చే విషయాన్ని పాలకులు పట్టించుకోవడం లేదని ప్రజలు పేర్కొంటున్నారు.

నిబంధనల మేరకే..

మడిగెల విషయంలో ఏఎంసీ నిబంధనల మేరకే వ్యవహరిస్తున్నాం. పాతమడిగెలను సొంతం చేసుకునేందుకు ఎవరూ ముందుకు రావడం లేదు. ఒక మడిగెకు ఏడాదికి 5శాతం అద్దె పెంచి వసూలు చేస్తున్నాం. బిల్లులు మంజూరు చేయకపోవడంతో కొత్తమడిగెల భవనాన్ని కాంట్రాక్టర్ మాకు అప్పగించలేదు. ఇదే విషయం ఉన్నతాధికారులకు వివరించాం.

– ధూమ్యానాయక్, ఏఎంసీ కార్యదర్శి, సారంగపూర్

ఖాళీ స్థలంలో ప్రైవేటు వ్యక్తుల వ్యాపారాలు



మార్కెట్ స్థలంలో అద్దె చెల్లించకుండా వ్యాపారం చేస్తున్న ప్రైవేటు వ్యక్తులు

ఓ వైపు మార్కెట్ కమిటీ మడిగెలు ఖాళీగా దర్శనమిస్తుంటే.. మరోవైపు మార్కెట్ యార్డు ఖాళీ స్థలంలో ప్రైవేటు వ్యక్తులు అద్దె చెల్లించకుండా వ్యాపారాలు చేసుకుంటున్నారు. ఈ వ్యాపారాలనే మడిగెల్లో కొనసాగిస్తే వ్యవసాయ మార్కెట్‌కు ఆదాయం సమకూరుతోందని ప్రజలు పేర్కొంటున్నారు.

హడలెత్తిస్తున్న వీధికుక్కలు

- వీధుల్లో గుంపులుగుంపులుగా సంచారం
- వెంటపడి కరుస్తున్నాయంటున్న ప్రజలు
- ఇళ్ల నుంచి బయటకు వచ్చేందుకు జంకుతున్న వైనం
- సమస్య పరిష్కరించాలని వేడుకోలు



బాసరలో..



ముధోల్‌లో గుంపులుగా తిరుగుతున్న కుక్కలు

ముధోల్: ముధోల్‌తోపాటు మండలంలోని ఆయా గ్రామాల్లో వీధికుక్కలు గుంపులు గుంపులుగా తిరుగుతూ ప్రజలను బెంబేలెత్తిస్తున్నాయి. బాటసారులు, సైకిల్‌పై వెళ్లేవారితోపాటు ద్విచక్ర వాహనదారుల వెంట పడి కరుస్తున్నాయి. చిన్నారులతోపాటు వృద్ధులపై దాడులు చేస్తుండటంతో గాయపడి ఆసుపత్రిలో చేరుతున్నారు. వీటి దాడిలో మేక పిల్లలు, గొర్రెలు, ఇతర పశువులు ప్రాణాలు కోల్పోతున్నాయి. దీంతో ప్రజలు ఇళ్ల నుంచి బయటకు వచ్చేందుకు జంకుతున్నారు. రాత్రి వేళ వీధుల్లో అరవడంతో నిద్ర ఉండటం లేదని వాపోతున్నారు. అధికారులు స్పందించి వెంటనే గ్రామాల్లో ఊర కుక్కల బెడద నివారణకు చర్యలు తీసుకోవాలని ప్రజలు వేడుకుంటున్నారు.

బాసరలో..

బాసర: బాసరలో వీధికుక్కలు గుంపులు గుంపులుగా తిరగడంతో గ్రామస్తులు భయాందోళన చెందుతున్నారు. ఇటీవల పిచ్చికుక్క గ్రామానికే చెందిన ఇద్దరిపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచాయి. దీంతో ఏయే పిచ్చికుక్క ఎటు నుంచి వచ్చి కరుస్తుందోనని జనం ఇళ్ల నుంచి బయటకు రావడం లేదు. అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఈకేవైసీ ప్రక్రియ పూర్తిచేయాలి

తానూరు: మండలంలోని గ్రామాల్లో ఉపాధి కూలీల ఈకేవైసీ నమోదు ప్రక్రియ పూర్తిచేయాలని ఈజీఎస్ ఏపీవో శివలింగం సూచించారు. బుధవారం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఉపాధిహామీ సిబ్బందితో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇతర గ్రామాలకు వెళ్లిన వారికి సమాచారం అందించి వారికి కేవైసీ పూర్తి చేయాలని సూచించారు. నాటిన మొక్కలకు కంచె ఏర్పాటు చేసి సంరక్షించడంతోపాటు పండ్ల తోటల మొక్కలు నాటించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఈసీ జితేందర్, టీఏలు, ఎఫ్ఏలు ఉన్నారు.

పరామర్శ

లోకేశ్వరం: మండల కేంద్రానికి చెందిన మామిడి పపేశ్వర్ తల్లి గంగవ్వ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా బాధిత కుటుంబసభ్యులను బుధవారం ఉమ్మడి జిల్లా జెడ్పీ మాజీ చైర్మన్ లోలం శ్యాంసుందర్ పరామర్శించారు. మృతికి కారణాలను తెలుసుకున్నారు. ఆయన వెంట నాయకులు శ్యాంసుందర్, అనిల్, ప్రకాశ్, దిగంబర్, ప్రశాంత్ ఉన్నారు.

నగదు వెంట తీసుకెళ్లొద్దు

తానూరు: స్థానికసంస్థల ఎన్నికల కోడ్ నేపథ్యంలో రూ.50 వేల కంటే ఎక్కువ నగదును వెంట తీసుకెళ్లొద్దని ఎస్సై షేక్ జుబేర్ అన్నారు. బుధవారం మండలంలోని ఉమ్రి(కే) గ్రామంలో ఎన్నికల నియామవళిపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. పంటలను అమ్మి డబ్బులు తీసుకొచ్చే రైతులు రశీదులను వెంట ఉంచుకోవాలని సూచించారు. అభ్యర్థుల కోసం గొడవలకు దిగొద్దని.. మద్యం ,డబ్బు వంటి ప్రలోభాలకు గురి చేస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో గ్రామస్తులు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

హిందూ సంప్రదాయాలు కాపాడాలి



పథసంచాలన్‌లో కార్యకర్తలు

ఖానాపూర్: హిందూ సమాజాన్ని సంఘటితం చేసి హిందూ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడటమే ఆర్ఎస్ఎస్ ఉద్దేశమని ఆర్ఎస్ఎస్ ఇందూర్ విభాగ్ కార్యవాహ రాజులవార్ దిగంబర్ అన్నారు. బుధవారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆర్ఎస్ఎస్ పథసంచాలన్ నిర్వహించగా ఆయన హాజరై మాట్లాడారు. దేశంలోని హిందువులను ఏకం చేసి మతం, ప్రాంతం అనే బేధాలను తొలగించడమే ఆర్ఎస్ఎస్ లక్ష్యమన్నారు. ఆర్ఎస్ఎస్ ఎవరికి వ్యతిరేకం కాదని ఆపత్కాలం, విపత్తుల వేళ స్వయం సేవకులు మానవత్వంతో పనిచేస్తారని పేర్కొన్నారు. అంతకముందు పట్టణంలోని వీధుల్లో ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు పథ సంచాలన్ నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా సంఘచాలక్ నూకల విజయ్, విశ్రాంత ఉద్యోగి ఎనుగు అశోక్‌రెడ్డి, జిల్లా ధర్మ సంయోజక ప్రముఖ్ పడాల ప్రభాకర్, ఖానాపూర్ ఖండ కార్యవాహ తుమ్మనపెల్లి సంకేత్‌వర్ధన్, ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు జితేందర్, సమీరాజ్, శ్రీచక్ర, విష్ణు, రాజేశ్వర్ గౌడ్, సాయి తదితరులున్నారు.

పోలీసులపై దాడి చేసినందుకు జైలుశిక్ష

లక్ష్మణచాంద: విధి నిర్వహణలో ఉన్న హెడ్ కానిస్టేబుల్, కానిస్టేబుల్‌పై దాడి చేసిన వ్యక్తికి మూడు నెలలు జైలుశిక్ష విధిస్తూ నిర్మల్ ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ కోర్టు మెజిస్ట్రేట్ ఎస్.శ్రీవాణి తీర్పునిచ్చారు. బుధవారం లక్ష్మణచాంద ఎస్సై శ్రీనివాస్ వివరాలు వెల్లడించారు. 2016లో మండలకేంద్రంలోని శ్రీవాణి వైన్స్ ఎదుట లక్ష్మణచాందకు చెందిన పత్తిపాక గంగన్న న్యూసెన్స్ చేస్తుండగా హెడ్‌కానిస్టేబుల్, కానిస్టేబుల్ అతడికి నచ్చజెప్పేందుకు యత్నించగా.. పట్టించుకోకుండా వారి విధులకు ఆటంకం కలిగించాడు. హెడ్ కానిస్టేబుల్ ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్సై మహేందర్ కేసు నమోదు చేసి ఛార్జ్‌షీట్ దాఖలు చేశారు. లాయర్ వినోద్‌రావు కోర్టులో వాదనలు వినిపించగా కేసు పూర్వ పరాలను పరిశీలించిన మెజిస్ట్రేట్ శ్రీవాణి నిందితుడికి మూడు నెలల జైలుశిక్ష విధిస్తూ తీర్పు వెల్లడించారు. ఈసందర్భంగా కోర్టు కానిస్టేబుల్ వినోద్, ఎస్సై మహేందర్‌ను ఎస్పీ జానకీ షర్మిల అభినందించారు.

ఓటీపీలు, బ్యాంకు వివరాలు చెప్పొద్దు

భైంసాటౌన్: ఫోన్‌కు వచ్చే ఓటీపీలు, బ్యాంకు, వ్యక్తిగత వివరాలు అపరిచితులకు చెప్పొద్దని డిజిటల్ రంగ నిపుణుడు డాక్టర్ శంకర్ అన్నారు. బుధవారం పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ డిజిటల్ యుగంలో సైబర్ నేరాలు పెరుగుతున్నందున అందరూ అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు. ఫోన్లకు వచ్చే లింకులు ఓపెన్ చేయొద్దని సూచించారు. ట్రేడింగ్, ఇన్వెస్ట్‌మెంట్ స్కామ్‌లు, ఫిషింగ్, విషింగ్, సిమ్ స్వాప్, నకిలీ షాపింగ్ వెబ్‌సైట్ల గురించి వివరించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ పవన్ పాండే, ఐక్యు ఏసీ కోఆర్డినేటర్ రవికుమార్, పీజీ రెడ్డి, సుధాకర్, ఓం ప్రకాశ్, సురేందర్, సంతోష్, నహీదా, దివ్య, కల్పన రాజయ్య, కిషన్, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా శారదాదేవి నిమజ్జనం



అమ్మవారి శోభాయాత్రలో కోలాటం ఆడుతున్న మహిళలు

భైంసాటౌన్: పట్టణంలో శారదామాత ఉత్సవాలు ముగిశాయి. ఈమేరకు బుధవారం శారదాదేవి విగ్రహాల నిమజ్జనం నిర్వహించారు. స్థానిక ఆర్యవైశ్య సంఘం, బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ఐదు రోజులపాటు భక్తి శ్రద్ధలతో అమ్మవారిని కొలిచారు. ఈసందర్భంగా మహిళలు అమ్మవారి విగ్రహాలను శోభాయాత్రగా గడ్డెన్నప్రాజెక్టు వద్దకు తరలించారు. కోలాటం వేస్తూ నృత్యాలు చేస్తూ సందడిగా గడిపారు. అమ్మవారికి హారతి, పూజా కార్యక్రమాల అనంతరం నీటిలో నిమజ్జనం చేశారు.

‘ఆరు గ్యారంటీలపై నిలదీయండి’



కుంటాలలో బాకీ కార్డులు పంపిణీ చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

కుంటాల: స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారంటీలపై నిలదీయాలని జెడ్పీ మాజీ చైర్మన్ లోలం శ్యాంసుందర్ పేర్కొన్నారు. బుధవారం కుంటాలలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన 22 నెలల్లో కాంగ్రెస్ చేసిన బాకీల కార్డులను ఇంటింటా పంపిణీ చేసి మాట్లాడారు. స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ నాయకులకు ఓటమి భయం పట్టుకుందన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల కన్వీనర్ పడకంటి దత్తాద్రి, సోషల్ మీడియా జిల్లా ఇన్‌చార్జి పెంటవార్ దశరథ్, శ్రీనివాస్‌రావు, నరేశ్, వంశీ, దిలీప్, గంగాధర్, సాయిలు, ప్రవీణ్, దత్తు, గగన్, బాబు,సాయిరాజ్, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

ముధోల్: స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి గుణపాఠం చెప్పాలని ముధోల్ నియోజకవర్గ బీఆర్ఎస్ సమన్వయ సమితి సభ్యులు డాక్టర్ పడకంటి రమాదేవి అన్నారు. బుధవారం మండలంలోని తరోడా గ్రామంలో బీఆర్ఎస్ కార్యకర్తలతో కలిసి కాంగ్రెస్ పార్టీ నెరవేర్చని హామీలను వివరించే బాకీ కార్డులను ఆవిష్కరించారు. బండారి గంగాధర్, అశోక్, గణపతిజాదవ్, భూమారెడ్డి, గంగారెడ్డి, విఠల్, సాయి తదితరులు ఉన్నారు.

ప్రతిఒక్కరూ ఆరోగ్యంపై దృష్టి సారించాలి



పరీక్షిస్తున్న వైద్యులు

దిలావర్‌పూర్: ప్రతిఒక్కరూ వ్యాయామం చేస్తూ.. మంచి ఆహారపు అలవాట్లు అలవర్చుకొని సంపూర్ణ ఆరోగ్యవంతులుగా మారాలని హైదరాబాద్‌లోని రామంతపూర్ ప్రభుత్వ హోమియో వైద్య కళాశాల వైద్యాధికారి డాక్టర్ మోహన్‌లాల్ అన్నారు. మండలంలోని సిర్గాపూర్ గ్రామంలో గురడి రెడ్డికాపు సంఘ భవనంలో బుధవారం హోమియో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందించారు. అనంతరం ప్రభుత్వ పాఠశాల, ప్లేర్ ఉన్నత పాఠశాలలో సంపూర్ణ ఆరోగ్యానికి తీసుకోవాల్సిన సూచనలు చేశారు. ఇందులో ప్రొఫెసర్ డాక్టర్ అనిల్‌కుమార్, వైద్య బృందం రాంప్రసాద్, డీపీఎం శ్రవణ్‌కుమార్, నర్సారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

‘బీజేపీకి ప్రజలే బుద్ధి చెప్పాలి’



సారంగాపూర్‌లో సంతకాలు సేకరిస్తున్న డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు, నాయకులు

సారంగపూర్: ఓటు చోరీకి పాల్పడే బీజేపీకి ప్రజలే తగిన బుద్ధి చెబుతారని డీసీసీ అధ్యక్షుడు కూచాడి శ్రీహరిరావు అన్నారు. మండలంలోని బీరవెల్లి, మలక్‌చించోలి, సారంగాపూర్ గ్రామాల్లో ఓటు చోరీకి వ్యతిరేకంగా నిర్వహించిన సంతకాల సేకరణ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఇతర రాష్ట్రాల్లో బీజేపీ దొంగ ఓట్లు చెలామణి చేస్తూ ఓటు చోరీకి పాల్పడుతుందని ఆరోపించారు. ఇది ప్రజాస్వామ్య వ్యవస్థకు వెన్నుపోటుగా అభివర్ణించారు. కార్యక్రమంలో నిర్మల్, ముధోల్, ఖానాపూర్ నియోజకవర్గాల ఇన్‌చార్జి రాంభూపాల్, టీపీసీసీ కార్యదర్శి రాజేశ్వర్, పార్టీ మండల అధ్యక్షుడు నర్సయ్య, ఏఎంసీ చైర్మన్ హాదీ, మాజీ జెడ్పీటీసీ పత్తిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దశరథ రాజేశ్వర్, గ్రామాల నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

చిన్నారులకు టీకాలు



శిబిరంలో వైద్యసిబ్బంది, బాలింతలు

లోకేశ్వరం: ఐదేళ్లలోపు చిన్నారులకు తప్పనిసరిగా వ్యాధి నిరోధక టీకాలు వేయించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ దూసముడి లక్ష్మి అన్నారు. బుధవారం లోకేశ్వరం పీహెచ్‌సీలో చిన్నారులకు టీకాలు వేశారు. కార్యక్రమంలో ఏఎన్ఎం మరియా తదితరులు ఉన్నారు.